క్లుప్తంగా

ఉల్చాలలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఉల్చాల ఎస్సీ కాలనీలో రూ.16 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ విద్యాసాగర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతి పల్లెలో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు దగ్గర చేసేందుకు గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా, విలేజ్ క్లినిక్ భవనాలు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఉల్చాల గ్రామంలో ఇంటింటికీ తాగునీటి సదుపాయం, సీసీరోడ్డు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, వార్డు సభ్యులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు కంబదహాల్‌లో ఆరోగ్య సురక్ష

సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా మంగళవారం మండలంలోని కంబదహాల్ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని సచివాలయ ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుందని, గ్రామస్తులు ఉచిత వైద్య సేవలను పొందాలని కోరారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

సంత మార్కెట్ వేలం వాయిదా

గూడూరు: మున్సిపల్ సంత మార్కెట్‌కు వేలం పాట వాయిదా వేసినట్లు కమిషనర్ వి.దివాకరరెడ్డి సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. తిరిగి వేలం ఎప్పుడు వేసేది తెలియజేస్తామని చెప్పారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.154 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

పాణ్యం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. పలుచోట్ల సీసీ రోడ్లు కూడా వేశారు. తమ్మరాజుపల్లె గ్రామంలో గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, మద్దూరులో గ్రామ సచివాలయం, సీసీ రోడ్లు, నెరవాడలో గ్రామ సచివాలయం, రైతు భరోసా, సీసీ రోడ్లు వేశారు. వాటిని మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

నేడు పక్కీరప్ప తాత ఆరాధనోత్సవం

కోడుమూరు రూరల్: కోడుమూరులోని మహాయోగి పక్కీరప్ప తాత ప్రథమ ఆరాధన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తాత భక్త బృందం సభ్యులు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం మహాగణపతి పూజ, సంప్రోక్షణ, గంగాపూజ, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నలుగురు పశు సహాయకుల నియామకం



నూతనంగా నియమితులైన పశు సహాయకులు

సి.బెళగల్: మండలానికి నలుగురు పశు సహాయకులు నియామకం అయినట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు. ఈ మేరుకు వారు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విధుల్లో చేరారు. బురాన్‌దొడ్డి సచివాలయానికి సంధ్య, పోలకల్–1 సచివాలయానికి కృష్ణవేణి, కంబదహాల్‌కు జాహ్నవి, సంగాలకు మహేంద్ర నియమితులయ్యారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని ఎంపీడీఓ, ఎంపీపీ బొంతు మునెప్ప వారికి సూచించారు. పశుపోషణ, సంరక్షణలో పాడి రైతులకు అండగా నిలవాలని, ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పశువులకు అందేలా చూడాలని, ఉత్తమ సేవలతో మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి

- ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో వారిది కీలక పాత్ర
- వలంటీర్లకు వందనంలో కుడా చైర్మన్ కోట్ల హర్ష, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త సతీష్



ఉత్తమ పురస్కారాలు పొందిన వలంటీర్లతో కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు

కర్నూలు సిటీ: గ్రామ/వార్డు సచివాలయ వలంటీర్ల సేవలు ఎనలేనివని కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం 103వ వార్డు సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కర్నూలు అర్బన్ మండల పరిధిలోని 38, 39,40 వార్డులకు చెందిన ఉత్తమ వలంటీర్లను సత్కరించి మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల దగ్గరకు చేర్చడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారు వారధులుగా నిలుస్తున్నారన్నారు. 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఈ వలంటీర్ల వ్యవస్థ ప్రస్తుతం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా ప్రత్యేకంగా అభినందిస్తోందన్నారు. ఉత్తమ వలంటీర్లకు సేవా వజ్ర పేరుతో రూ.45 వేల నగదు, సేవా రత్న పేరుతో రూ.30 వేలు, సేవా మిత్ర పేరుతో రూ.15 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తుందన్నారు. వరుసగా నాలుగు ఏడాది నియోజకవర్గంలోని పలువురు వలంటీర్లకు ఈ పురస్కారాలు ప్రదానం చేయడంతో సంతోషంగా ఉందన్నారు. సంక్షేమ పాలనతో పేదవారి గుండెల్లో గుడి కట్టుకున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు మరింత మేలు జరగాలంటే మళ్లీ ఆయనను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 39వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ్ సింహారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ మండల జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రాము, గిరిప్రసాద్, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ బోర్డు మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ మాఫీని వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : నగరపాలక పరిధిలో ఆస్తి పన్ను బకాయిదారులకు ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటించినందున వినియోగదారులు వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక రెవెన్యూ విభాగం ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో నివసిస్తున్న ప్రజలు తమ ఆస్తి పన్ను, నీటిపన్ను బకాయిలు చెల్లించాలన్నారు. ఈనెలాఖరు నాటికి పెండింగ్ లేకుండా పన్నులు చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలన్నారు. బకాయిలు ఉన్న ఆస్తి పన్ను, ఖాళీ స్థల పన్ను (వెకేట్ ల్యాండ్ ట్యాక్స్) వంటివి చెల్లించిన వారికి వడ్డీ మాఫీ ఉంటుందని చెప్పారు. గడువు దాటిన వారిపై ప్రభుత్వ పరంగా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వాజిద్, రాజు, మన్సూర్ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులు బీఎస్సీ నర్సింగ్ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వారు విడుదల చేశారన్నారు. ఇందులో తమ కళాశాలకు చెందిన 49 మంది విద్యార్థులు హాజరు కాగా, అందులో 11 మంది డిస్టింక్షన్, 22 మంది ఫస్ట్ క్లాస్, ఏడుగురు సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. కళాశాల టాపర్‌గా పి.శ్రీలేఖ 88 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారన్నారు.

నో ఎంట్రీ సమయంలో ఇసుక ట్రాక్టర్లు కనిపిస్తే సీజ్

ఇసుక ట్రాక్టర్ల యజమానులకు సీఐ హెచ్చరిక



ఇసుక ట్రాక్టర్ల యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ గౌతమి

కర్నూలు: నో ఎంట్రీ సమయంలో ఇసుక ట్రాక్టర్లు నగరంలోకి వస్తే సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ గౌతమి యజమానులను హెచ్చరించారు. వన్‌టౌన్ పరిధిలోని ఉస్మానియా కాలేజీ రోడ్డులో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభ, ముగింపు సమయాల్లో ఇసుక ట్రాక్టర్లు ఆ మార్గం గుండా తిప్పరాదని సూచించారు. ఉస్మానియా కాలేజీ మార్గం గుండా ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నందున ట్రాఫిక్ రద్దీ పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు రావడంతో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి మోటార్ వెహికల్ చట్టం కింద అపరాధ రుసుం విధించారు. ట్రాక్టర్ యజమానులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఉదయం వేళల్లో స్కూల్ పిల్లలు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాగా జీవనాధారం కోసం ట్రాక్టర్లు నడుపుకుంటున్నామని, మన్నించి ట్రాక్టర్లను వదిలిపెట్టాలని యజమానులు కోరగా అందుకు ఆమె సమ్మతించి మొదటి తప్పిదం కింద వదిలేశారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియోచుక్కలు

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్



పల్స్‌పోలియో కార్యక్రమం గురించి డాక్టర్ సందీప్ పటేల్‌కు వివరిస్తున్న ప్రవీణ్‌కుమార్

కర్నూలు (హాస్పిటల్): జిల్లాలో సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలను ఏ ఒక్కరినీ వదలకుండా పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం నగర శివారులోని బి.తాండ్రపాడు, హుసేనాపురం, కాల్వబుగ్గ గ్రామాల్లో జరుగుతున్న డోర్ టు డోర్ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సౌత్ ఇండియా రీజియన్ టీమ్ లీడర్ డాక్టర్ సందీప్ పటేల్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి ఒక్క చిన్నారికీ పల్స్‌పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. ఈ రోజు, రేపు కూడా గృహ సందర్శనలు చేసి పిల్లలకు పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని సూచించారు. హైరిస్క్ ఏరియాలైన వలసలతో కూడిన మురికివాడలు, నిర్మాణ స్థలాలు, సంచార జాతులు, ఇటుకల బట్టీలు, ఇతర ఫ్యాక్టరీ ప్రాంతాల్లో నివసించే పిల్లలకు తప్పకుండా పల్స్‌పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. ఈ మూడు రోజుల్లో వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

11న మార్కెట్ యార్డులో జంబోషెడ్డు ప్రారంభం



జంబోషెడ్డు పనులను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ గోవిందు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో 150 మీటర్ల పొడవు, 21 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న జంబోషెడ్డు ఈనెల 11వ తేదీ ప్రారంభించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జంబో షెడ్డుకు జీఐ ప్రొఫైల్ షీట్‌లతో పైకప్పు వేసే పనులు రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఆ పనులను మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందుతో కలిసి సోమవారం చైర్మన్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మార్కెట్‌లో వ్యవసాయ పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు జంబోషెడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన ట్యాంక్



కల్లూరు: మండల పరిధిలోని కొంగనపాడు గ్రామంలో రూ.33.20లక్షలతో నూతనంగా నిర్మించిన ఓహెచ్ఆర్ఎస్ ట్యాంక్, పైప్‌లైన్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై వాటిని ప్రారంభిస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

వేసవిలో బోర్ల కింద సాగు వద్దు



ప్యాలకుర్తి రైతులతో మాట్లాడుతున్న ఏఓ

కోడుమూరు రూరల్: బోరుబావులున్న రైతులంతా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎలాంటి పంటలు సాగు చేయరాదని కోడుమూరు ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై వేసవిలో వ్యవసాయ పనులు, రబీ కింద సాగు చేసిన పంట నమోదు జాబితాపై చర్చించారు. వేసవిలో రైతులంతా తమ పొలాలను దుక్కులు దున్నుకోవాలని, పొలాల్లో మిగిలిపోయిన పంట, కలుపు మొక్కలను తీసివేసి గట్లపై కాల్చివేయాలని సూచించారు. వేసవిలో పంటల సాగు వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అనంతరం రబీ కింద పంట నమోదు చేయించుకున్న రైతుల జాబితాను ఆర్‌బీకే సిబ్బందితో చదివి వినిపించారు. జాబితాలో ఏవైనా తప్పులుంటే సరిచేసుకోవాలని సూచించారు.





ఇసుక ట్రాక్టర్‌తో సెబ్ పోలీసులు,కర్లకుంటలో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు హంద్రీ నది నుంచి ఆదివారం రాత్రి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ పోలీసులు పట్టుకున్నారు. వర్కూరుకు చెందిన రాముడు, సుంకన్నలకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు కోడుమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ రామాంజనేయులు సోమవారం తెలిపారు. అక్రమంగా హంద్రీ నుంచి ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు సెబ్ పరిధిలోని క్రిష్ణగిరి మండలం కర్లకుంట గ్రామ శివారులో శివన్న అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా నాటు సారా తయారు చేస్తున్నాడు. సోమవారం సెబ్ పోలీసులు దాడి చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సీఐతో పాటు సెబ్ పోలీసులు వెంకటేష్ నాయక్, ఆఫ్రోజ్‌బాషా, శంకర్ నాయక్, విరుపాక్షి రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలను సందర్శించిన ఐబీ బృందం



విద్యార్థులను అభినందిస్తున్న అమెరికా, ఇంగ్లాండు దేశస్తులు

పాణ్యం: మండలంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికల)ను సోమవారం ఐబీ బృందం సందర్శించింది. పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆ బృందం సభ్యులు పరిశీలించారు.అమెరికాకు చెందిన వెండిగ్రీన్, ఎరిక్‌బాబర్, ఇంగ్లాండ్‌కు చెందిన డాక్టర్ గిరిబాబు యాదవ్ 8, 9వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంగ్లిషు, సైన్స్ ,మ్యాథ్స్ సబ్జెక్టుల్లో వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తున్న విద్యార్థులను అభినందించారు. పాఠశాలలో బాలికలకు మౌలిక సదుపాయాలు బాగా ఉన్నాయని ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారి లలిత కుమారి, ఎంఈఓ కోటయ్య, ప్రిన్సిపాల్ మేరీ సలోమి, సీఆర్పీలు శ్రీహరి, రాజశేఖర్ పాల్గొన్నారు.

31 వరకు లేపాక్షి క్లియరెన్స్ సేల్ మేళా

కర్నూలు(అగ్రికల్చర్): లేపాక్షి హ్యాండీ క్రాప్ ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్ మేళా చేపట్టినట్లు మేనేజర్ బి.తిమ్మయ్య తెలిపారు. పోచంపల్లి బెడ్‌షీట్లు, కలంకారీ బ్యాగ్‌లు, నారాయణపేట చీరలు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, నరసాపూర్ అల్లికలు తదితర ఎంపిక చేసిన వాటిపై 10 నుంచి 40 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీ క్రాప్ ఎంపోరియంలో ఈ నెల 31 వరకు క్లియరెన్స్ మేళా జరుగుతుందని చెప్పారు.

స్పందన అర్జీలకు తక్షణ పరిష్కారం



స్పందనలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

సి.బెళగల్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని తహసీల్దార్ అనుపమ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. చెరువు మట్టిని పొలాలకు తరలించేందుకు రైతులకు అనుమతి ఇవ్వాలని సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న అధికారులను కోరారు.అదేవిధంగా రైస్‌కార్డు మంజూరు,మా ర్పులు తదితర వాటిపై గుండ్రేవుల గ్రామస్తులు అర్జీలు ఇచ్చారు. వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు విచారించి న్యాయం చేయాలని తహసీల్దార్ అధికారులకు సూచించారు. ఈఓఆర్డీ సందీప్, హౌసింగ్ ఏఈ సుమంత్, ఎంఈఓ జ్యోతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

గూడూరు: స్పందనలో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహశీల్దార్ ఉదయ్ సంతోష్ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో స్పందన నిర్వహించారు. ఎంపీడీఓ కుమారి జయశ్రీ, పీఆర్ ఏఈ గోపాల్‌రావ్, వైకేపీ ఏపీఎం చక్రధర్, ఎంఈఓ సునీలమ్మ, తదితరులు పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- పెసరవాయిలో జొన్న కొనుగోలు పరిశీలనలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



పెసరవాయిలో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

గడివేముల: రైతు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని నంద్యా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం చేపట్టిన జొన్నల కొనుగోలులో రాజకీయలకు తావు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం మండల పరిధిలోని పెసరవాయిలో ఆయన జొన్న రైతులతో మాట్లాడారు. రెండు రోజుల కిందట టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు గ్రామంలో జొన్నలు విక్రయించిన రైతుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ కొనుగోళ్లలో అన్ని గ్రామాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అంచనాలకు మించి దిగుబడులు రావటంతో.. నాణ్యత నిర్ధారణ ఇతర ప్రక్రియలను పూర్తి చేసేందుకు కాస్త సమయం పడుతుందే తప్ప వేరే కారణాలు లేవన్నారు. రైతన్నలు ఆందోళన చెందాల్సిన పనిలేదని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 1800 టన్నుల జొన్నలు కొనుగోలు చేశామన్నారు. కొనుగోలులో చిన్న,సన్న కారు రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగరాజు, ఏఓ హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడండి



భోగేశ్వరాలయం వద్ద ఏర్పాట్లను పరిశీస్తున్న పాణ్యం సీఐ, ఆలయ చైర్మన్

గడివేముల: మహాశివరాత్రి సందర్భంగా భోగేశ్వరాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని పాణ్యం సీఐ నల్లప్ప సూచించారు. సోమవారం గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీదుర్గా భోగేశ్వరాలయాన్ని పరిశీలించారు. పార్కింగ్, తదితర ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేయాలని చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డిలకు సూచించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సీఐ వెంట ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, ధర్మకర్తలు సురేంద్రనాథ్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ, ఆలయ సిబ్బంది రమణ, తదితరులు ఉన్నారు.

శివరాత్రి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలో మహాశివరాత్రి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ నటరాజ్ అన్నారు. శనివారం సాయంత్రం కాల్వబుగ్గ బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఆలయ నిర్వాహకులతో రెవెన్యూ, పోలీసు అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలు తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్‌కు సూచించారు. భక్తుల అవసరరీత్యా ఆలయ పరిసరాల్లో ఉన్న రెండు కోనేర్లను నీటితో నింపాలన్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా స్నానపు ఘట్టాలను సమకూర్చాలని పేర్కొన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా భద్రత సిబ్బందిని నియమించాలని సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డికి చెప్పారు. వాహనాల పార్కింగ్, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, ఎస్ఐ రాజారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు జీకే వెంగన్న, ఆకుల మహేష్, ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణశర్మ, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలుపై దుష్ప్రచారం సరికాదు

గడివేముల: ప్రభుత్వం మద్దతు ధరకు జొన్న కొనుగోలు చేస్తుంటే టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం సరికాదని నంద్యాల జిల్లా యూత్‌వింగ్ సెక్రటరీ ద్వారం శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన పెసరవాయిలో మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో పంట ఉత్పత్తుల కొనుగోలు లేక రైతన్నలు తీవ్ర ఇబ్బంది పడ్డారన్నారు. నాటి ప్రభుత్వం వారిని పట్టించుకోలేదన్నారు. నేడు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రతి పంటకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తుంటే ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ వారికే గన్ని సంచులు ఇస్తున్నారని మాట్లాడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఎలాంటి పక్షపాతం చూపకుండా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. పెసరవాయి రైతులకు జొన్న కొనుగోలులో ఏ చిన్న ఇబ్బంది తలెత్తినా తన దష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అదనంగా మరో 300 మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోళ్లకు ఆదేశాలు ఇవ్వడం సంతోషకరమన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.